ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888
పేజీలు : 4 | సంపుటి : 01 | - సంచిక 195 | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | సోమవారం 21- 10 - 2024 | వెల - 2
Digital Edition



- ఆసక్తికరంగా కొనసాగనున్న సీజన్ -4 ఎపిసోడ్స్
- సీఎం చంద్రబాబుతో ఎపిసోడ్‌ను పూర్తి చేసిన బాలకృష్ణ
- ఈ నెల 25న ఆహాలో స్ట్రీమింగ్ కానున్న తొలి ఎపిసోడ్

నందమూరి బాలకృష్ణ ఓ వైపు సినిమాలు చేస్తూనే మరోవైపు పలు షోలకు హోస్ట్‌గా వ్యవహరించాడు. అందులో ప్రముఖ టాక్ షో అన్‌స్టాపబుల్ ఒకటి. ఇప్పటి వరకు వచ్చిన మూడు సీజన్లకు ఆడియన్స్ నుంచి విపరీతమైన క్రేజ్ వచ్చింది. ముఖ్యంగా బాలయ్య బాబు తన శైలిలో ఈ టాక్ షోను పైకి లేపారు. రాజకీయ నాయకులు, సినీ సెలబ్రిటీలతో ఈ టాక్ షోకు కొత్త ఉత్సాహం వచ్చింది.

అన్‌స్టాపబుల్ 4

2లో



# తొలి ఎపిసోడ్‌లో చంద్రబాబు

## మహారాష్ట్ర ఎన్నికలకు
## అభ్యర్థుల జాబితా విడుదల చేసిన బీజేపీ

- మహారాష్ట్రలో నవంబరు 20న అసెంబ్లీ ఎన్నికలు
- ఈ నెల 22న నోటిఫికేషన్
- నేడు తొలి జాబితా ప్రకటించిన బీజేపీ హైకమాండ్



మహారాష్ట్ర రిపబ్లిక్ న్యూస్) మహారాష్ట్ర లో నవంబరు 20న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ నెల 22న నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీలన్నీ అభ్యర్థుల ఎంపిక, జాబితాల విడుదల వంటి పనులతో బిజీగా ఉన్నాయి. తాజాగా, బీజేపీ కూడా అభ్యర్థుల జాబితా విడుదల చేసింది. 99 మంది అభ్యర్థులతో బీజేపీ నేడు తొలి జాబితా ప్రకటించింది.

2లో

## రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణ లేదు: రోజా

వైఎస్సార్ జిల్లాలో ఘోరం
ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన మాజీ ప్రియుడు
చికిత్స పొందుతూ మృతి చెందిన అమ్మాయి
రాష్ట్రం అత్యాచారాంధ్రప్రదేశ్ గా మారిపోయిందన్న రోజా

వైఎస్సార్ జిల్లా బద్వేలులో ఇంటర్ విద్యార్థినిపై మాజీ ప్రియుడు పెట్రోల్ పోసి నిప్పంటించగా, ఆ విద్యార్థిని చికిత్స పొందుతూ మృతి చెందడం తెలిసిందే. ఈ ఘటనపై మాజీ మంత్రి, వైసీపీ నేత రోజా తీవ్రస్థాయిలో స్పందించారు.

రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వరుస అత్యాచారాలు, హత్యలతో ఆంధ్రప్రదేశ్ ను 'అత్యాచారాంధ్రప్రదేశ్'గా మార్చేసిందని విమర్శించారు. వైఎస్సార్ జిల్లాలో ప్రేమోన్మాది దాడిలో ఆడబిడ్డ కన్నుమూసిందని పేర్కొంటూ... మృతురాలి తల్లి భోరున విలపిస్తున్న వీడియోను రోజా సోషల్ మీడియాలో పంచుకున్నారు. రోదిస్తున్న ఆ కన్నతల్లి గర్భశోకం మీ చెవులకు వినిపిస్తోందా? అంటూ చంద్ర బాబు, హోంమంత్రి అనిత, పవన్ కల్యాణ్ లను ప్రశ్నించారు.





## ఏంటి బ్రో ఇంత తాగేశారు
## మూడు రోజుల్లో మరీ ఇన్ని కోట్ల ఆదాయమా

ఏపీలో నూతన మద్యం విధానం మొదలైన మూడురోజులకే కోట్లలో ఆదాయం వచ్చింది. మూడు రోజులకే రూ.541 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయని ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. మొత్తం 6,77,511 కేసుల లిక్కర్ అమ్మకాలు, 1,94,261 బీర్ల అమ్మకాలు జరిగాయని అన్నారు.

### మద్యం అమ్మకాలు, ఆదాయంలో తెలంగాణే టాప్..!

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నూతన మద్యం విధానం అమలు చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు నూతన మద్యం విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి తీసుకొచ్చారు. ఇటీవలే ఈ నూతన మద్యం షాపుల లైసెన్సుల కోసం నోటిఫికేషన్ జారీ చేసి.. దరఖాస్తులు స్వీకరించారు.

రాష్ట్ర వ్యాప్తంగా మద్యం షాపులకు లాటరీ డ్రా నిర్వహించారు. మొత్తం 3,396 షాపులకు 89,882 దరఖాస్తులు వచ్చాయి. వీటికి కలెక్టర్ల ఆధ్వర్యంలో అధికారులు లాటరీ తీసి మద్యం షాపుల విజేతల్ని ప్రకటించారు. మద్యం షాపులు గెలుపొందిన వారు వచ్చే రెండేళ్ల వరకు వ్యాపారం చేసుకోవచ్చు. ఈ లిక్కర్ షాపుల దరఖాస్తు ప్రక్రియతో ప్రభుత్వానికి రూ.1,797.64 కోట్ల ఆదాయం వచ్చింది.

అనంతరం అక్టోబర్ 16 నుండి రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చింది. అయితే గతం కంటే ఈసారి రాష్ట్రంలో బ్రాండెడ్ మద్యం అందుబాటులో తీసుకువచ్చింది కూటమి ప్రభుత్వం. ధర కూడా తక్కువగానే ఉండటంతో మందు బాబులు తమ సత్తా చాటారు. కేవలం రూ.99 లకే క్వార్టర్ బాటిల్ అందుబాటులోకి వచ్చింది. తాజాగా ఈ మూడు రోజుల్లో జరిగిన మద్యం అమ్మకాల వివరాలను ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

### మూడు రోజుల్లో కోట్ల విలువైన మద్యం అమ్మకాలు

దీని బట్టి చూస్తే ఏపీలో మద్యం ప్రియులు వారి తడాఖా చూపించినట్లు తెలుస్తోంది.

-మిగతా 2లో

## దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తాం: మంత్రి నాదెండ్ల

ఎన్నికల వేళ సూపర్ సిక్స్ హామీలు
ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు
త్వరలో జరిగే క్యాబినెట్ భేటీలో ఆమోదం తీసుకుంటామన్న మంత్రి నాదెండ్ల
ఈ పథకానికి ఏడాదికి రూ.3 వేల కోట్లు ఖర్చవుతుందని వెల్లడి

మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని టీడీపీ కూటమి ఎన్నికల వేళ హామీ ఇచ్చింది. ఇప్పుడా హామీ నిలబెట్టుకునేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది.

2లో




## గదుల కొరత.. వంతుల వెత

- జిల్లాలో దయనీయంగా షిఫ్ట్ స్కూళ్ల నిర్వహణ
- సరిపడా తరగతి గదులు లేక విద్యార్థుల ఇబ్బందులు
- 46 భవనాల్లో.. 93 పాఠశాలల కొనసాగింపు
- పలుచోట్ల వరండాల్లోనే బోధన

హైదరాబాద్ సిటీ రిపబ్లిక్ న్యూస్): హైదరాబాద్ జిల్లాలో షిఫ్ట్ (వంతుల) స్కూళ్ల పరిస్థితి దయనీయంగా మారింది. తరగతి గదుల కొరతతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. వంతుల బడి తరగతులను జనరల్ ఫిఫ్ట్‌కు మార్చాలని తల్లిదండ్రులు కోరుతున్నప్పటికీ సరిపడా క్లాస్ రూమ్‌లు లేకపోవడంతో అధికారులు

2లో



# అన్‌స్టాపబుల్ 4 తొలి ఎపిసోడ్‌లో చంద్రబాబు..

వారి సీక్రెట్స్‌ను చెప్పమని బాలయ్య బాబు నవ్వించే తీరు అందరినీ ఆకట్టుకుంది. ఇలా వరుసగా మూడు సీజన్లను తన బుజాలపై వేసుకుని విపరీతమైన క్రేజ్ తెచ్చాడు. పవన్ కళ్యాణ్, ప్రభాస్, గోపీచంద్, సిద్ధూ జొన్నలగడ్డ, శర్వానంద్ సహా మరెంతో మంది నటులతో సరదా సరదాగా ముచ్చటించారు. అలాగే అప్పటి ప్రతిపక్ష నేత టీడీపీ అధినేత చంద్రబాబును సైతం ఇంతకు ముందు సీజన్‌లో తీసుకొచ్చాడు. ఆ ఎపిసోడ్‌కి బాగా రెస్పాన్స్ వచ్చింది.

అయితే అన్‌స్టాపబుల్ నాలుగో సీజన్ ఎప్పుడెప్పుడు ప్రారంభం అవుతుందా అని ఆడియన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి ఒక గుడ్ న్యూస్ వచ్చింది. ఓటీటీ ప్లాట్ ఫార్మ్ ఆహాలో ఈ షో సరికొత్త సీజన్ అక్టోబర్ 25 నుంచి ప్రసారం కానుంది. ఈ నాలుగో సీజన్‌కు కూడా బాలయ్య బాబే హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు.

అయితే ఈ షోకి సంబంధించిన మొదటి ఎపిసోడ్ షూటింగ్ ప్రస్తుతం అన్నపూర్ణ స్టూడియోస్‌లో జరుగుతోంది. ఈ తొలి ఎపిసోడ్‌లో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా కనిపించనున్నారు. ఇందులో భాగంగానే చంద్రబాబు ఆహా సెట్‌లో దర్శనమిచ్చారు. ఆయనకు పుష్పగుచ్చం అందించి అన్‌స్టాపబుల్ సెట్‌లోకి బాలయ్య ఆహ్వానించారు. ప్రస్తుతం అందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

**ఏ ఏ విషయాలపై మాట్లాడుతారు**

కాగా ఈ తొలి ఎపిసోడ్‌లో చంద్రబాబు ఏ ఏ విషయాలపై మాట్లాడుతారో అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అందిన సమాచారం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టబోయే కార్యక్రమాలు, ప్రజలకు చేయవలసిన మంచి పనులు సహా తన వ్యక్తిగత విషయాలు గురించి చెప్పే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. చూడాలి మరి ఈ ఎపిసోడ్‌లో చంద్రబాబు ఏ విషయాలపై మాట్లాడతారో.

## తీతువు పిట్టల్లా లొల్లి..!

అమంగళం ప్రతిహతం అవుగాక! మళ్లీ ప్రతిపక్షంలో కూర్చోడానికి కూడా సిద్ధమే అని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పడంతో వైసీపీకి చెందిన పలువురు 'మాయాబజార్' చిత్రంలో శకుని చెప్పిన ఈ డైలాగ్‌ను గుర్తు చేసుకున్నారు. జగన్‌రెడ్డి మాటల్లో ఈ మధ్య తడబాటు కనిపిస్తోంది. తాను మళ్లీ అబద్ధాలు చెప్పి ఉంటే అధికారంలోకి వచ్చి ఉండేవాడినని ఆయన చెప్పుకోవడంతో వైసీపీ నాయకులు ఆశ్చర్యపోయారు. ఈ మాటకు అర్థాలు తీస్తే 2019 ఎన్నికలకు ముందు అబద్ధాలు చెప్పడం వల్లనే అధికారంలోకి వచ్చామని ఆయన చెప్పకనే చెప్పారని సరిపెట్టుకున్నారు. రాజకీయాల్లో అబద్ధాలు చెప్పడం సహజమేగానీ ఇలా అసంకల్పితంగా నిజాలు చెప్పుకొంటే ఎలా అని విస్తుపోతున్నారు. ఆడిన మాట తప్పని సత్య హరిశ్చంద్రుడిని అని చెప్పుకోవడానికి జగన్‌రెడ్డి ఈ మాట అని ఉండవచ్చుగానీ, ఫలితంగా అతడి అంతరంగం ఆవిష్కృతమైంది. వాస్తవానికి జగన్‌రెడ్డి నోరు తెరిస్తే అబద్ధాలు అలవోకగా ప్రవహిస్తాయి. 2019 ఎన్నికలకు ముందు, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అసత్యాలే పునాదులుగా ఆయన రాజకీయాలు సాగాయి. తాజా వ్యాఖ్యలతో ఆయన గతంలో చెప్పిన అబద్ధాలను ప్రజలు మళ్లీ గుర్తు చేసుకున్నారు. దీంతో తలలు పట్టుకోవడం వైసీపీ నాయకుల వంతైంది. "వచ్చే ఎన్నికల తర్వాత కూడా ప్రతిపక్షంలో కూర్చోవడానికి సిద్ధమే కానీ అబద్ధాలు మాత్రం చెప్పను" అని జగన్‌రెడ్డి చెప్పుకోవడంతో ఆయన కుటుంబ సభ్యులు కూడా విస్తుపోయారు.

**మరి... నిజం చెప్పాలి కదా!**

వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సమకూర్చుకున్న ఆస్తులలో తన కుమార్తె షర్మిలకు కూడా సమాన వాటా ఉండాలని, తన భార్య విజయలక్ష్మికి వాటా అవసరం లేదని ఆడిటర్లకు ఆయన సూచించడం వాస్తవమో కాదో జగన్‌రెడ్డి స్పష్టం చేయాలి. వాస్తవమే అయితే ఆస్తుల్లో షర్మిలకు వాటా ఇవ్వడానికి ఎందుకు నిరాకరించారో చెప్పాలి కదా! తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకొని వందల, వేల కోట్ల పెట్టుబడులను సేకరించి, సొంత మీడియాను ఏర్పాటు చేసుకొని కూడా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తనకు మీడియా లేదని చెప్పుకోవడం అబద్ధం కాదా? రోత మీడియా తనది కాకపోతే తన భార్య భారతీరెడ్డి దానికి చైర్‌పర్సన్ ఎలా అవుతారో, మెజారిటీ షేర్లు తన పేరిట, తన కంపెనీల పేరిట ఎలా ఉంటాయో వివరించాలి కదా! సొంత బాబాయ్ వివేకానందరెడ్డిని హత్య చేసింది, చేయించిందీ ఎవరో తెలిసి కూడా ఆ నెపాన్ని చంద్రబాబు మీదకు నెట్టడానికి ప్రయత్నించింది నిజం కాదా? 2019కి ముందు కోడి కత్తితో దాడి చేయించుకొని, అది కూడా చంద్రబాబు పనేనని ప్రచారం చేయించి రాజకీయ లబ్ధి పొందడం నిజం కాదని చెప్పగలరా? అవినీతి కేసులలో తండ్రి రాజశేఖర రెడ్డి పేరు చేర్పించి తాను తప్పించుకోవాలని ప్రయత్నించడం నిజం కాదా? అమరావతిలోనే రాజధాని ఉంటుందని, అందుకే అక్కడ ఇల్లు కట్టుకున్నానని ఎన్నికలకు ముందు చెప్పడం నిజం కాదా? ఎన్నికల తర్వాత మూడు రాజధానులు అని చెప్పి ప్రభుత్వ సొమ్ముతో ప్రధాన నగరాలు, పట్టణాల్లో ప్యాలెస్‌లు నిర్మించుకోవాలనుకోవడంలో నిజం లేదా? అధికారం ఇస్తే మద్యపాన నిషేధం అమలు చేస్తానని చెప్పి... అత్యంత నాసిరకం మద్యాన్ని ప్రజలకు విక్రయించి అక్కడ కూడా డబ్బు సంపాదించుకొనే నీచానికి ఒడిగట్టింది ఎవరో జగన్‌రెడ్డి చెప్పగలరా? ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో! 'నువ్వు అబద్ధమాడితే బాగుండు అని ఎవరైనా చెబితే... లేదు, ప్రతిపక్షంలో కూర్చోవడానికి కూడా సిద్ధమే. కానీ, అబద్ధం మాత్రం చెప్పలేను' అని చెప్పడమే పెద్ద అబద్ధం కదా?

**మరవగలమా మీ పాలన...** అబద్ధాల విషయం అలా ఉంచితే, ప్రజలు తన పాలనను ఎక్కడ మరచిపోతారోనని జగన్‌రెడ్డి గుర్తు చేస్తున్నారు. ప్రజలకు జ్ఞాపకశక్తి తక్కువని అంటారు. అందుకే తాము ఓడించిన పార్టీలనే ఐదేళ్ల తర్వాత ఆశీర్వదిస్తుంటారు. అయితే 2029 ఎన్నికల తర్వాత కూడా ప్రతిపక్షంలో కూర్చోవడానికి సిద్ధమైనందునే జగన్‌రెడ్డి తన రాక్షస పాలనను తానే ప్రజలకు పదే పదే గుర్తుచేస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఇసుక, మద్యం వ్యవహారాల్లో ఏదో జరిగిపోతోందని చెబుతూ తన దోపిడీని ప్రజలకు గుర్తు చేస్తున్నారు. చంద్రబాబు పాలనలో కక్ష సాధింపులు, వేధింపులు పరాకాష్ఠకు చేరాయని, నాలుగు నెలలకే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందని చెబుతూ తన పాలనను మళ్లీ మళ్లీ ప్రజలకు గుర్తు చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజకీయ వేధింపులే అజెండాగా పాలన సాగించి చంద్రబాబును జైల్లో పెట్టే వరకు శాంతించని తనను ప్రజలు ఎక్కడ మరచిపోతారోనని గుర్తు చేస్తూనే ఉన్నారు. పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేయడంలో సరికొత్త రికార్డులు నెలకొల్పడం ద్వారా తన ప్రత్యర్థులపైకి ఉసిగొల్పిన జగన్‌రెడ్డి అప్పుడు ఏం జరిగిందో గుర్తు చేస్తున్నారు. జగన్‌రెడ్డి గతంలో చెప్పినవన్నీ అబద్ధాలని తెలుసుకోవడం వల్లనే ప్రజలు తాజా ఎన్నికల్లో ఆయన పార్టీని పదకొండు సీట్లకే పరిమితం చేయడం మాత్రం సత్యం. చంద్రబాబు ప్రభుత్వం జగన్‌రెడ్డి అడుగుజాడల్లో నడవడం లేదు. అయినా అధికారంలో ఉన్నప్పుడు తానేం చేశానో, ఎంత అరాచకంగా ప్రవర్తించానో గుర్తు చేస్తూ చంద్రబాబు ప్రభుత్వానికి దిశానిర్దేశం చేస్తున్నారా అన్నట్టుగా జగన్‌రెడ్డి వ్యాఖ్యలు ఉంటున్నాయి. అబద్ధాలే పునాదులుగా అధికారంలోకి వచ్చిన వ్యక్తి తాను అబద్ధాలే ఆడనని చెప్పుకోవడం వింతగా ఉన్నప్పటికీ... అతగాడి మనస్తత్వానికి ఆ మాటలు అద్దం పట్టడం లేదా? ప్రజల జ్ఞాపకశక్తి తక్కువే అయివుండవచ్చునుగానీ తమరి పాలనను ప్రజలు అంత తొందరగా ఎలా మరచిపోగలరు? జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనను ఒక పీడ కలగా ప్రజలు గుర్తుపెట్టుకుంటూనే ఉంటారు. ఆ రాక్షస పాలనను మరచిపోదామన్నా మరచిపోలేని పరిస్థితి! ప్రతిపక్ష నాయకుడి స్థాయి నుంచి సామాన్య ప్రజల వరకు ఎవరికీ స్వేచ్ఛ లేకుండా జగన్‌రెడ్డి పాలన సాగింది. అప్పట్లో ఎవరైనా స్వేచ్ఛగా ఫోన్లలో మాట్లాడుకోగలిగారా? జగన్‌రెడ్డి సొంత మనుషులు, కలెక్షన్ ఏజెంట్లు కూడా ఫోన్లలో స్వేచ్ఛగా మాట్లాడుకోగలిగారా? లేదే! 'మీరు ఎవరెవరితో మాట్లాడేదీ, మీకు వచ్చే మెసేజులు అన్నీ నాకు తెలుస్తాయి' అని తన అంతరంగికులలో ఒకరిని జగన్‌రెడ్డి హెచ్చరించడం నిజం కాదా? ఇప్పుడు చంద్రబాబు పాలన ఎలా ఉన్నది, ఎలా ఉండబోతున్నది అన్న విషయం పక్కన పెడితే... ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడుకోగలుగుతున్నారు. ఫేస్ టైం, సిగ్నల్ వంటి యాప్‌ల అవసరం లేకుండా ఫోన్లలో మామూలుగా మాట్లాడుకోగలుగుతున్నారు. ప్రజలకు కనీస స్వేచ్ఛ లేకుండా సాగించిన పాలన కూడా పాలన అవుతుందా? కాదు.. కాజాలదు!

**హవ్వ... ఆ నోట ఈ మాటా!**

అధికారం ఉన్నది సొంత ఆదాయం పెంచుకోవడానికి మాత్రమే అని నమ్మి ప్రభుత్వ వనరులను కొల్లగొట్టి, నాసిరకం మద్యం సరఫరా చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన జగన్‌రెడ్డి ఇప్పుడు ప్రవచనాలు చెబుతున్నారు. సత్యహరిశ్చంద్రుడే జీవించి ఉంటే... 'నేను అబద్ధాలు చెప్పను' అనే జగన్ మాటలు విని సిగ్గుతో చచ్చిపోయేవారేమో! పురాణాల్లో పౌండ్రక వాసుదేవుడి గురించి చెప్పారుగానీ ఇలాంటి అపర సత్యహరిశ్చంద్రుడి గురించి చెప్పలేదు. నోరు తెరిస్తే అబద్ధాలు మాత్రమే చెప్పే జగన్‌రెడ్డి వంటి కేరెక్టర్లు కూడా ఉంటాయని ఎవరూ ఊహించి ఉండరు. కొంత మంది నోటి వెంట కొన్ని మాటలు వింటే వినసొంపుగా ఉంటాయి. జగన్‌రెడ్డి వంటి వారు నీతి, నిజాయితీ, విలువలు, విశ్వసనీయత వంటి మాటలు వల్లెవేస్తే వినడానికే రోతగా ఉంటుంది. రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలేసి ప్రజలను అడుక్కునే వారి స్థాయికి దిగజార్చడం ద్వారా అధికారాన్ని అంటిపెట్టుకోవాలని చూసిన జగన్‌రెడ్డి కుయుక్తులను ప్రజలే తిప్పికొట్టారు. సంక్షేమం పేరిట ప్రజలకు డబ్బు పంచిపెట్టినా ఎన్నికల్లో తనకు ఓటమి ఎందుకు ఎదురైందో తెలుసుకునే ప్రయత్నం చేయకపోగా 'నేను అబద్ధం చెప్పను' అని చెప్పుకోవడం ఆత్మవంచన కాదా? ప్రతిపక్షంలో కూర్చోవడానికి కూడా సిద్ధమేగానీ అబద్ధాలు మాత్రం చెప్పనని జగన్‌రెడ్డి అన్నప్పుడు ఆ కార్యక్రమంలో పాల్గొన్న కొంత మంది చప్పట్లు కొట్టడం చూస్తే వైసీపీలో ఇంకా ఉన్మాదుల సంఖ్య తగ్గలేదనిపిస్తోంది. తాను అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత చంద్రబాబు హైదరాబాద్‌లో నివసించడమేమిటి? అని ప్రశ్నించిన జగన్‌రెడ్డి ఇప్పుడు తాను బెంగళూరులోని ప్యాలెస్‌లో ఎందుకు సేదదీరుతున్నారో చెప్పాలి. ఇదంతా కాదుగానీ నిత్యం బైబిల్ పఠనం చేస్తానని చెప్పే జగన్‌రెడ్డి... బైబిల్ చేత పట్టి ఏసు ప్రభువు సమక్షంలో ఆత్మపరిశీలన చేసుకుంటే తత్వం బోధపడుతుంది. అయినా మన పిచ్చిగానీ ఏసుప్రభువును కూడా తన స్వార్థానికి వాడుకుంటున్న విషయం అతనికి తెలియదా? అలాంటి వారిలో పరివర్తన రావాలనుకోవడం అమాయకత్వమే అవుతుంది. అరాచక మనస్తత్వంతో పాలించడం దైవ ప్రేరణ ఎలా అవుతుంది? ఇతరులను ప్రేమించడం గురించి చెప్పిన బైబిల్ పైశాచికంగా ప్రవర్తించమని బోధించలేదే?

**గతం మరిచిపోయి కథలు** అధికారంలో ఉన్నప్పుడు చెయ్యాల్సిన దురాగతాలన్నీ చేసి ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి, పత్రికా స్వేచ్ఛ గురించి, పోలీసుల వేధింపుల గురించి వైసీపీ మూక మాట్లాడటం జుగుప్సాకరంగా ఉంది. అప్పటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని తెలుగుదేశం అధికార ప్రతినిధి పట్టాభి బోసడీకే అని తిట్టడం వల్ల తమ కార్యకర్తల రక్తం మరిగి, తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేస్తే చేసి ఉండవచ్చునని సజ్జల రామకృష్ణారెడ్డి అనే మాజీ జర్నలిస్టు చెబుతున్నారు. ఈ కేసులో పోలీసులు తనను విచారణకు పిలవడం ఏమిటి? అని కూడా ఆయన ప్రశ్నిస్తున్నారు. బోసడీకే అన్న పదం వాడినందుకే రక్తం మరిగి దాడులు చేసే పరిస్థితి ఉంటే, చంద్రబాబు ధర్మపత్నిని నిండు సభలో దారుణంగా అవమానించి వ్యక్తిత్వ హననానికి పాల్పడినప్పుడు అవతలి వారి రక్తం ఇంకెంత మరగాలి? తన సతీమణిని అవమానించడంతో తట్టుకోలేక చంద్రబాబు బోరున విలపించారేగానీ కత్తులు, కర్రలు తీసుకొని వెళ్లమని కార్యకర్తలను ఉసిగొల్పలేదే? బోరుగడ్డ అనిల్ అనే వ్యక్తి తిట్టిన తిట్లను ఎవరైనా మరచిపోగలరా? ఇళ్లలోని ఆడవాళ్లకు కూడా మినహాయింపు లేకుండా దారుణంగా దూషించినా తెలుగుదేశం కార్యకర్తలు కానీ, జనసేనాని పవన్ కల్యాణ్ అభిమానులుగానీ రెచ్చిపోలేదే? అది వారి సంస్కారం. ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కొడాలి నాని, వల్లభనేని వంశీ, పేర్ని నాని, జోగి రమేశ్, రోజా వంటి వారి మాటలు, వాడిన భాష విన్నప్పుడు రక్తం మరగదా? ఇళ్లలోని ఆడవాళ్లను సైతం బజారుకు ఈడ్చిన వాళ్లను ఏం చేయాలి? జగన్‌రెడ్డిలో ఉన్న లక్షణాల్లో పదోవంతు చంద్రబాబులో ఉండి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. పోలీసు విచారణకు హాజరైన సజ్జల రామకృష్ణారెడ్డి గంటల వ్యవధిలోనే బయటకు వచ్చి తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడిని సమర్థించుకోగలిగేవారా? ఎంపీ అని కూడా చూడకుండా రఘురామకృష్ణ రాజును పోలీసులతో చితగ్గొట్టించిన విషయం మరచిపోతే ఎలా? పోలీసు ఉన్నతాధికారులైన పి.సునీల్ కుమార్, పీఎస్సార్ ఆంజనేయులు, రఘురామిరెడ్డి కిరాయి సైనికులుగా మారి చేసిన దురాగతాలను సజ్జల మరచిపోయినా ప్రజలు మరచిపోతారా? జగన్‌రెడ్డి రోత మీడియాపై పోలీసులు ఒక కేసు పెట్టినందుకే ఇప్పుడు పత్రికా స్వేచ్ఛ అంటూ పెడబొబ్బలు పెడుతున్నారే? నిన్నటిదాకా మీరు చేసిందేమిటి? రఘురామకృష్ణరాజుతోపాటు నాపైనా, మా సహచరులపైనా దేశద్రోహం కేసు పెట్టిన విషయం మరిచారా? 'ఆంధ్రజ్యోతి' సంస్థలపై సీఐడీ అధికారులు ఎన్నో కేసులు పెట్టారు కదా! ఆ కేసులలో మా సిబ్బంది కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు కదా? రోత పత్రికపై కేసు పెట్టడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని... జగన్‌రెడ్డి దయవల్ల ఐదేళ్ల పాటు మీడియా సలహాదారు పదవిలో కొనసాగిన దేవులపల్లి అమర్ అనే జర్నలిస్టు నాయకుడు ఇప్పుడు అంటున్నారు. ఆయనకు అప్పుడు పత్రికా స్వేచ్ఛ కనిపించలేదా? 'ప్రచురించిన వార్తల విషయమై ప్రభుత్వానికి అభ్యంతరం ఉంటే వివరణ ఇవ్వాలి! సదరు వివరణను ప్రచురించకపోతే పరువు నష్టం దావా వేసుకోవచ్చునుగానీ కేసులు పెట్టడం ఏమిటి?' అని ఇప్పుడు ప్రవచనాలు చెప్పడం ఏమిటి? ఇదే సలహా జగన్‌రెడ్డి ప్రభుత్వానికి మీడియా సలహాదారుడిగా ఎందుకివ్వలేదు? మాపై కేసులు పెట్టినప్పుడు ప్రభుభక్తి మత్తులో దేవులపల్లి అమర్ నిద్రపోయారా? ఐదేళ్ల పాటు శాసనసభ కార్యక్రమాలను ప్రసారం చేయకుండా ఏబీఎన్‌పై నిషేధం విధించడాన్ని మరచిపోతే ఎలా? ముఖ్యమంత్రి కార్యాలయానికి, నివాసానికి వెళ్లకుండా 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులపై నిషేధం విధించడాన్ని ఏమనాలి? రోత మీడియాతోపాటు మరో రెండు కూలి మీడియా చానళ్ల ప్రసారాలను ఇప్పుడు అడ్డుకోవడంపై పెడబొబ్బలు పెడుతున్నారే! మీరు అధికారంలో ఉన్నప్పుడు ఏబీఎన్‌తో పాటు టీవీ5 ప్రసారాలను ఐదేళ్లపాటు అడ్డుకోలేదా? కర్మ మనల్ని వదలదు%-% తప్పు ఎవరు చేసినా తప్పే! జగన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన ఈ దురాగతాలను అప్పుడు ఖండించి ఉంటే ఇప్పుడు ఎవరికైనా ఏడ్చే అర్హత, హక్కు వచ్చి ఉండేవి. అప్పుడు ప్రభువు కళ్లలో ఆనందం చూసి నోళ్లకు తాళం వేసుకున్న వాళ్లు ఇప్పుడు తీతువు పిట్టల్లా లొల్లి చేసినా లాభం లేదు. మీరు ఏం చేశారో ప్రజలు మరచిపోలేదు కనుకే ఇప్పుడు జరుగుతున్న దాన్ని కూడా పట్టించుకోవడం లేదు. తగిన శాస్తి జరిగిందని సరిపెట్టుకుంటున్నారు. 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన కొత్తలో ఇప్పుడు కూలి మీడియాగా మారిన ఒక చానల్ ప్రసారాలను కొద్ది రోజులు ఆపించడంతో అలా చేయడం తప్పు అని నేను స్వయంగా ముఖ్యమంత్రికి చెప్పగలిగాను. ఏబీఎన్, టీవీ5 ప్రసారాలను ఐదేళ్లపాటు నిలిపివేసినా మాట్లాడని వారు ఇప్పుడు తమకు అన్యాయం జరిగిందని రోదించే అర్హత కోల్పోయారు. దుష్ట సంప్రదాయాలకు తలపడితే దాని పర్యవసానాలు ఇలాగే ఉంటాయి. మీడియాపై పోలీసు కేసు పెట్టడమేమిటి? అని రోత మీడియా ప్రతినిధి ప్రశ్నించగా, 'ఐదేళ్లుగా ఏం జరిగిందో నేను చూశాను. అప్పుడు ఎలా ఏం చేశారో ఇప్పుడు అలాగే చేశాం. అంతా చట్టప్రకారమే జరుగుతోంది. ఇందులో ఆక్షేపించడానికి ఏమీ లేదు' అని డీజీపీ ద్వారకా తిరుమలరావు కూల్‌గా బదులిచ్చారు.

**అందుకు సంతోషించండి...** ఇప్పుడు పోలీసు కేసులు, వేధింపులు, పత్రికా స్వేచ్ఛ అంటూ జగన్ అండ్ కోతో పాటు కొంత మంది వారి తాబేదార్లు గగ్గోలు పెట్టడం చూస్తే కౌరవ మూక హాహాకారాలను వింటూ 'ఆర్తనాదాలు శ్రవణానందకరంగా ఉన్నాయి' అని మాయాబజార్ చిత్రంలో ఘటోత్కచుడు చెప్పిన డైలాగ్ గుర్తుకొస్తుంది. జగన్‌రెడ్డి సాగించిన అరాచకాల ప్రభావం ఇప్పట్లో తొలగిపోదు. జగన్‌రెడ్డికి 2019లో లభించిన మెజారిటీ కంటే ఇప్పుడు కూటమి ప్రభుత్వానికి ఎక్కువ మెజారిటీ వచ్చింది. అయినా గతంలో జరిగిన వాటిని, రెడ్ బుక్‌లో రాసుకున్న వాటిని గుర్తుకు తెచ్చుకొని తాడూ బొంగరం లేని కేసులు పెట్టి వేధించనందుకు సంతోషించకుండా గగ్గోలు పెట్టడం అస్సలు బాగోలేదు. చంద్రబాబుకు జగన్ పూనితే పరిస్థితి ఏమిటో మీకే తెలుస్తుంది. అలా జరగడం లేదు కనుకే స్వేచ్ఛగా ప్రవచనాలు చెప్పుకోగలుగుతున్నారు. సొంత పార్టీ కార్యకర్తల నుంచి ఎంత ఒత్తిడి వస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు సంయమనం కోల్పోవడం లేదు. తప్పులు చేయడంలో కూడా హద్దులు మీరిన వారిని కూడా చట్టప్రకారమే శిక్షించాలనుకుంటున్నారు. తన వ్యక్తిగత జీవితం గురించి అవాకులు చవాకులు పేలినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రక్తం ఎంత మరగాలి? ప్రజలు అధికారం ఇచ్చింది కక్ష సాధింపులకు కాదు కదా అని అటు చంద్రబాబు, ఇటు పవన్ కల్యాణ్ నమ్ముతున్నందున వైసీపీ మూక స్వేచ్ఛగా తిరగగలుగుతోంది. కొంత మంది వ్యక్తులపై కేసులు పెడుతున్నా, పాత కేసులలో దర్యాప్తు వేగం పెరుగుతున్నా అదంతా చట్ట పరిధిలోనే జరగాలనుకుంటున్నారు. అనాగరికంగా ఆలోచించేవారే అయితే బూతులకు పేటెంట్ తీసుకున్న కొడాలి నాని వంటి వారికి పోలీస్ ట్రీట్‌మెంట్ చేయించడం ఎంత సేపు? పోలీసులు తనను దారుణంగా కొడుతున్నప్పుడు బాధతో రఘురామకృష్ణ రాజు అరచిన అరుపులు జగన్ అండ్ కోకు శ్రవణానందకరంగా అనిపించి ఉండవచ్చునుగానీ ప్రస్తుత ప్రభుత్వంలో అటువంటి పైశాచిక మనస్తత్వం ఉన్నవాళ్లు లేరనే చెప్పవచ్చు. అయితే గతంలో హద్దులు మీరి ప్రవర్తించిన వారిపై చర్యలు ఉండాల్సిందే. లేనిపక్షంలో అలాంటి వారిలో లెక్కలేనితనం వస్తుంది. అది రాజకీయాలకే కాదు రాష్ట్రానికీ మంచిది కాదు. దుష్టశిక్షణ ధర్మసమ్మతం, న్యాయ సమ్మతం అని దేవుడే చెప్పాడు. ఇందులో శషభిషలకు తావు ఉండకూడదు. అబద్ధాలు చెప్పడం అలవాటు లేదని అబద్ధం చెబుతున్న జగన్‌రెడ్డిని ప్రజలు ఇప్పట్లో విశ్వసించరు. సొంత పార్టీ వారే ఆయనను విశ్వసించడం లేదు. త్వరలోనే ఆ పార్టీకి చెందిన కీలక నేతలు జగన్‌కు బైబై చెప్పే అవకాశం ఉంది. ప్రస్తుతం చర్చల దశలోనే ఉన్నప్పటికీ వారు పార్టీని వీడితే మాత్రం మళ్లీ ప్రతిపక్షంలో కూర్చోవడానికి కూడా సిద్ధమే అన్న జగన్ మాటలు నిజమవుతాయి. తథాస్తు దేవతలు ఉందరా మరి! అభినవ సత్యహరిశ్చంద్రుడి రాజకీయ భవిష్యత్తు ఎలా ఉండబోతున్నదో వేచి చూద్దాం!

ఆర్కే

## ఏంటి బ్రో ఇంత తాగేశారు..
## మూడు రోజుల్లో మరీ ఇన్ని కోట్ల ఆదాయమా

తాము తలచుకుంటే ప్రభుత్వానికి ఎంతటి ఆదాయాన్ని అయినా తెచ్చిపెడతామన్నట్లుగా చేశారు మందుబాబులు. నూతన విధానం మొదలైన మూడురోజులకే కోట్లలో ఆదాయాన్ని తెచ్చిపెట్టారు.

రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజులకే రూ.541 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయని ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. మొత్తం 6,77,511 కేసుల లిక్కర్ అమ్మకం జరిగిందని అన్నారు. అదే సమయంలో 1,94,261 బీర్ల అమ్మకాలు జరిగాయని అన్నారు. దీంతో రాష్ట్రంలో మందు బాబులో ఏ లెక్కన తాగుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

## మహారాష్ట్ర ఎన్నికలకు
## అభ్యర్థుల జాబితా విడుదల చేసిన బీజేపీ

డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ పేరు కూడా ఈ జాబితాలో ఉంది. ఆయన నాగపూర్ నైరుతి నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. బీజేపీ మహారాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ భవాంకులే కంతి నియోజకవర్గం నుంచి బరిలో దిగుతున్నారు. బీజేపీ నేత, రాజ్యసభ ఎంపీ అశోక్ చవాన్ కుమార్తె శ్రీజయ చవాన్ భోకర్ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు.

బీజేపీ తొలి జాబితాలో... ముంబయి బీజేపీ అధ్యక్షుడు ఆశిష్ సేలార్, లోక్ సభ ఎంపీ నారాయణ్ రాణే కుమారుడు నితీశ్ రాణే కూడా చోటు దక్కించుకున్నారు.

మహారాష్ట్ర అసెంబ్లీలో 288 స్థానాలు ఉండగా, అన్నింటికీ ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. త్వరలోనే బీజేపీ తన తదుపరి జాబితా విడుదల చేయనుంది.

## గదుల కొరత.. వంతుల వెత

సతమతమవుతున్నారు. ఫలితంగా పలు ప్రాంతాల్లో విద్యార్థుల హాజరుశాతం క్రమేపీ తగ్గుతోంది.

జిల్లాలోని 16 మండలాల పరిధుల్లో 691 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో 1,12,480 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం స్కూళ్లలో 93 చోట్ల షిఫ్ట్ పద్ధతిన క్లాసులు కొనసాగుతున్నాయి. జనరల్, షిఫ్ట్ స్కూళ్లలో టైమింగ్స్ వేర్వేరుగా ఉండడంతో పిల్లలకు బోధనపై ఆసక్తి తగ్గుతున్నట్లు తెలుస్తోంది.

6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 12.30 గంటల తర్వాత క్లాసులు ప్రారంభమవుతుండడంతో చాలామంది పాఠశాలలకు గైర్హాజరవుతున్నారు. మధ్యాహ్నం వచ్చిన వారు సైతం క్లాస్ రూమ్‌ల్లో ఉపాధ్యాయులు చెబుతున్న పాఠాలను సరిగా వినడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. జనరల్ స్కూళ్లలో ఒక పీరియడ్ టైమ్ 45 నిమిషాలు కాగా, షిఫ్ట్ స్కూళ్లలో 30 నిమిషాలు మాత్రమే. దీంతో ఏటా చాలా స్కూళ్లలో పదో తరగతిలో సకాలంలో సిలబస్ పూర్తికాక ఆశించిన ఉత్తీర్ణత రావడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

**ఒకే క్లాస్‌రూమ్‌లో రెండు మీడియంలు**

జిల్లాలోని 46 భవనాల్లో 93 స్కూళ్లను షిఫ్ట్ పద్ధతిన నడిపిస్తున్నారు. పలుచోట్ల తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులను ఒకే క్లాస్‌రూమ్‌లో కూర్చోబెట్టి పాఠాలు చెబుతుండడంతో ఎవరికీ అర్థంకాని పరిస్థితి నెలకొంది. కొన్ని తరగతులను స్కూల్‌లోని వరండాలోనే నిర్వహిస్తున్నారు. 46 భవనాల్లో కొన్ని అద్దెకు ఉండడం, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం సరిగా లేకపోవడంతో అత్యవసరాలకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. షిఫ్ట్ స్కూళ్లను జనరల్‌గా మార్చే ప్రక్రియలో భాగంగా జిల్లా విద్యాశాఖాధికారులు కొద్దిరోజుల క్రితం పాటిగడ్డ, బేగంపేట, గడ్డి అన్నారం ప్రాంతాల్లోని పాఠశాలలను జనరల్‌గా మార్చారు.

టప్పాచబుత్ర, జాంబాగ్ తదితర వంచతుల బడులను కూడా మార్చేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ తరగతి గదుల కొరతతో తప్పనిసరి పరిస్థితిలో ఇంగ్లిష్, తెలుగు మీడియం స్కూళ్లను జతచేసి పాఠాలు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ పాఠశాలల్లోని తరగతి గదులకు మరమ్మతులు చేయడంతో ఇటీవల కొన్ని అందుబాటులోకి వచ్చాయి. కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లతోపాటు లైబ్రరీ గదులు, స్టోర్ రూములను ఖాళీ చేయించి షిఫ్ట్ విధానాన్ని సాధ్యమైనంత త్వరగా ఎత్తివేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఇటీవల ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

## దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తాం: మంత్రి నాదెండ్ల

దీనిపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించారు.

సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా... దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేస్తామని వెల్లడించారు. అర్హులైన వారికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి ఏడాదికి రూ.3 వేల కోట్లు ఖర్చవుతుందని మంత్రి నాదెండ్ల తెలిపారు.

త్వరలో జరిగే క్యాబినెట్ సమావేశంలో ఈ పథకానికి ఆమోదం తీసుకుంటామని పేర్కొన్నారు.

## మంత్రి తుమ్మల ప్రకటనపై
## ధర్నాకు దిగిన గులాబీ శ్రేణులు



**హైదరాబాద్:** రైతు భరోసాపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన ప్రకటనతో తెలంగాణ వ్యాప్తంగా రైతుల నిరసనలు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గులాబీ శ్రేణులు, రైతులు ఆందోళనలు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం పర్దిపూర్ గ్రామంలో డప్పు చప్పుళ్లతో కాంగ్రెస్ ప్రభుత్వం దిష్టిబొమ్మ శవయాత్రను ఊరేగింపుగా నిర్వహించి రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు దగ్ధం చేశారు.

ఆర్మూర్ మండలం మాణిక్ బండారు చౌరస్తాలో ఖరీఫ్ పంటకు రైతు భరోస ఇవ్వటం లేదని నిరసనగా ఆర్మూర్- నిజామాబాద్ రహదారిపై రైతుల రాస్తారోకో చేశారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు. గజ్వేల్ నియోజకవర్గం పరిధిలోని దుద్దెడ వద్ద రాజీవ్ రహదారిపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. మహేశ్వరంలో రైతు భరోసా వెంటనే అమలు చేయాలని కేటీఆర్ పిలుపు మేరకు, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాలమేరకు మహేశ్వరం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపి, అంబేద్కర్ విగ్రహానికి మెమోరాండం అందజేసి, సీఎం రేవంత్ దిష్టి బొమ్మ దహనం చేశారు. సీఎం డౌన్ సీఎం డౌన్ అంటూ బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు.

నల్గొండ జిల్లా చండూర్‌లోని స్థానిక చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. చేత కానీ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలి అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లా నర్సంపేట తెలంగాణ తల్లి విగ్రహం వద్ద.. రైతు భరోసా ఎగవేతను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు భరోసా వెంటనే ఇవ్వాలంటూ నిరసనకు దిగారు. హనుమకొండ జిల్లాలో రైతు భరోసా ఎగవేతను నిరసిస్తూ కాజీపేట చౌరస్తాలో ధర్నాకు దిగారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని త్రిపురారం మండల కేంద్రంలో రేవంత్ ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు.

## నంద్యాల జిల్లా ర్యాపిడ్, బ్లిట్జ్ చదరంగం జట్టు ఎంపిక పోటీలు ప్రారంభం




**నంద్యాల అక్టోబర్ 20 ( రిపబ్లిక్ న్యూస్)** నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం క్రాంతి నగర్ లో ఉన్న శ్రీ శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు నంద్యాల జిల్లా రాపిడ్ మరియు బ్లిట్జ్ విభాగాలలో చదరంగం జట్ల ఎంపిక పోటీలు ప్రారంభం అయ్యాయి. నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్ ముఖ్య అతిథులుగా పాల్గొని పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ చదరంగం క్రీడ మేధో క్రీడ అన్నారు.ఈ క్రీడ విద్యార్థులలో ఏకాగ్రత పెంచుతుందని,మెదడును పదను పెడుతుందని,సమయస్ఫూర్తి , విజయ కాంక్ష ఇనుమడింప చేస్తుందని అన్నారు. డిసెంబర్ రెండవ వారంలో నంద్యాలలో రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తున్నామని ప్రకటించారు.లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్ మాట్లాడుతూ నిరంతర సాధన ద్వారా క్రీడలలో విజయాలు సాధించవచ్చన్నారు. క్రీడలలో పాల్గొనడం ద్వారా క్రమశిక్షణ అలవడి విద్యార్థులు చదువులో కూడా రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు.

జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎంపికైన జట్లు పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం నందు జరగబోవు రాష్ట్రస్థాయి చదరంగం పోటీలలో నంద్యాల జిల్లా తరపున పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 150 మంది క్రీడాకారులు, కోచ్ లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## యోగ, పిరమిడ్లను కూల్చివేస్తానని సరికాదు-భూమా



మున్సిపల్ పార్క్ లోని ఆయుష్ యోగ , పిరమిడ్ సెంటర్ ను సందర్శించి అక్కడి ప్రజలను సమస్య గురించి అడిగి నంద్యాల టిడిపి మాజీ భూమా బ్రహ్మానంద రెడ్డి భూమా బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూప్రజలకు ఉపయోగపడుతున్న ఆయుష్ యోగ పిరమిడ్ సెంటర్ ను మున్సిపల్ అధికారులు తొలగిస్తా అనడం సరికాదు .నంద్యాలలో ఎన్నో మున్సిపల్ స్థలాలు అన్యాక్రాంతం కావడం జరిగింది. అలాగే మెయిన్ రోడ్ల పక్కన వున్నా మున్సిపల్ ఆస్తులలో బిల్డింగులు కడుతున్నారు. దాని గురించి పట్టించుకోకుండా పిరమిడ్ యోగా సెంటర్ ను కూల్చాలి అనడం అలాగే మొన్న ఒక మజీద్ ముందు వున్నా అర సెంటు మున్సిపల్ స్థలంలో ఆ మజీద్ వాళ్ళు చిన్న వరండా నిర్మిస్తే ఆ స్థలం మున్సిపాలిటీది అని దాన్ని కూల్చేయడం జరిగింది మున్సిపల్ స్థలాలను కబ్జాలు చేసే వాళ్ళను వదిలేసి ప్రజలకు ఉపయోగపడే దగ్గరికి వచ్చి కూల్చేస్తాం అనడం సరికాదు ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా చేస్తే చూస్తూ ఊరుకునేది లేదనీ అంతగా మీరు అక్కడే అభివృద్ధి చేయాలి అంటే ప్రజలకు ఉపయోగపడుతున్న ఆ యోగ పిరమిడ్ సెంటర్లను మున్సిపాలిటీ నే తీసుకుని నడిపించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు

## యోగ సెంటర్ ను రాజకీయం చేయొద్దు ఎన్ఎండి ఫిరోజ్




**నంద్యాల అక్టోబర్ 20 ( రిపబ్లిక్ న్యూస్)):** నంద్యాల స్థానిక టౌన్ హాల్ పక్కన ఉన్న పార్కులో నిర్వహిస్తున్న యోగా సెంటర్ పై గత రెండు రోజుల నుంచి సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై నేడు నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ స్పందించడం జరిగింది. యోగ సెంటర్ విషయాన్ని రాజకీయం చేయొద్దని తెలియజేశారు

ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో జరుగుతున్న ప్రతి విషయం మంత్రి ఫరూక్ దృష్టిలో ఉందని మంత్రి ఫరూక్ ప్రభుత్వ కార్యక్రమాలు ఉన్నందున నంద్యాలలో లేకపోవడం ఈ రెండు రోజుల నుంచి పార్కులో ఉన్న యోగ సెంటర్ విషయంపై సోషల్ మీడియాలో పలు వార్తలు రావడం జరిగిందని మంత్రి ఫరూక్ నంద్యాలకు వచ్చిన తర్వాత ఆ విషయంపై చర్చిస్తారని ఫిరోజ్ తెలిపారు . అలాగే ఏదో మైలేజ్ వస్తుందని యోగా సెంటర్ విషయాన్ని రాజకీయం చేయొద్దన్నారు .

## కొత్తూరు శ్రీ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు..

**పాణ్యం, అక్టోబర్ 20, రిపబ్లిక్ న్యూస్ ::** పాణ్యం మండలంలోని ఎస్.కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఆలయ ఈవో యం.రామక్రిష్ణ ఆధ్వర్యంలో ఆదివారం రోజున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగలింగేశ్వర స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల నారాయణ శర్మ, కంపమల్ల సురేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రాతఃకాల పూజలు, గందం అభిషేక పూజలు, రుద్రాభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. అనంతరం మధ్యాహ్నకాల సమయంలో స్వామివారికి సర్ప సూక్తంతో సుగంధ ద్రవ్యాలతో పంచామృత అభిషేకం, మహా నైవేద్యం, మహా మంగళహారతి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. విచ్చేసిన భక్తాదులందరూ విశేషంగా స్వామి వారిని దర్శించుకున్నారు.




# బాలఅకాడమి రవీంద్ర హైస్కూల్ పాఠశాల

### చిన్నారులచే ఆకుపచ్చ కలర్ ఆక్టివిటి

**నంద్యాల అక్టోబర్ 20 (రిపబ్లిక్ న్యూస్):** బాల అకాడమీ రవీంద్ర పాఠశాల యందు ఈ రోజు ఆకుపచ్చ కలర్ ఆక్టివిటిని నిర్వహించారు. విద్యార్థులు ఆకుపచ్చ దుస్తులు ధరించి, వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు మరియు బొమ్మలు తెచ్చి అలంకరించారు. ద్రాక్ష, మిరప, బెండకాయ, వంకాయ, దోసకాయ మాస్క్ లు అలంకరించుకున్నారు. చిన్నారులు నీలిరంగు మరియు పసుపు పచ్చరంగు కలిపి ఆకుపచ్చ రంగును తయారుచేశారు. ప్రకృతిలో ఎక్కడ చూసిన పచ్చదనమే కనిపిస్తుంది. రామచిలుకలు, సీతాకోక చిలుకలు, పచ్చికబయళ్ళు(గార్డెన్) చెట్లు, గాజులు ఇలా ఎన్నో ఆకుపచ్చ రంగులో ఉంటాయని చిన్నారులు తెలుసుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రనాథ్ , ప్రిన్సిపాల్ శ్రీమతి మాధవీలత గారు మాట్లాడుతూ జాతీయ జెండాలోని ఆకుపచ్చరంగు పంట పొలాలకు ప్రతీక. ఈ రంగు ఎదుగుదలకు నిలకడకు గుర్తు.

ఆకుపచ్చ రంగు ఆరోగ్యపరంగా ఎంతో మేలు చేస్తుంది. ఆకుపచ్చ రంగు నుండి వచ్చే కాంతికిరణాలు కళ్ళకు చలువ చేస్తాయి. ఈ రంగు ఎన్నో వ్యాధులను అరికడుతుంది.

మన పర్యావరణాన్ని కాపాడేశక్తి కూడ ఆకుపచ్చ రంగుకు ఉంటుందని మన ప్రకృతే మనకు చెబుతుంది. దాని వలననే మనము మొక్కలను ఎక్కువగా నాటడం జరగాలి. దీనిని పురస్కరించుకొని పాఠశాల యందు చిన్నారులకు చెట్లను నాటి వాటిని సంరక్షించడం తెలియాలని వనం-మనం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. మొక్కలు జీవకోటికి అత్యంత అవసరమైన ప్రాణవాయువుని అందించడంలో సహకరిస్తాయి. కావున పచ్చదనం యొక్క ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని కోరారు.



## డోన్ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో కొండపేట, పాతపేట ప్రాంతాలలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్

**అసాంఘిక, సంఘ విద్రోహశక్తుల ఆట కట్టించి నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**రౌడీషీటర్లు, అనుమానిత ప్రాంతాలు,**

**అనుమానస్పద వ్యక్తుల ఇళ్ళల్లో విస్తృతంగా దాడులు**

**హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు**

**డోన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంతియాజ్ భాషా**

**నంద్యాల క్రైం, అక్టోబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** నేర నివారణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి ఉంచి జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆదివారం కార్డెన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో డోన్ డిస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో డోన్ టౌన్, రూరల్ ఇన్స్పెక్టర్లు రాకేష్, ఇంతియాజ్ భాష ఆధ్వర్యంలో క్యూ.ఆర్.టీం సిబ్బంది స్థానిక పోలీసులు బృందాలుగా ఏర్పడి నేడు తెల్లవారుజామున డోన్ పట్టణంలోని కొండపేట , పాతపేట ప్రాంతాలలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితులు, రౌడీ షీటర్లు, నేర చరిత్ర గల వారి ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ ఏవరైనా చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, పోలీసు అధికారులు హెచ్చరించారు. కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతుంటాయని పేర్కొన్నారు. ఈ విధంగా కార్డెన్ సర్చ్ ఆపరేషన్ చేయడం వలన పట్టణాలలో గ్రామాలలో ఎలాంటి నేరాలు జరగకుండా ఉంటాయని నేరాలు చేసిన వారిని పోలీసులు ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరని ప్రజలు తెలియజేస్తూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్యూ.ఆర్.టీం సిబ్బంది స్థానిక పోలీసులు పాల్గొన్నారు.





# ఆరోగ్యం విషయలో జాగ్రత్తగా ఉండండి

**సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్**




**నంద్యాల అక్టోబర్ 20 ( రిపబ్లిక్ న్యూస్):** పేద ప్రజలు ఆపదలో ఉంటే 'నేనున్నాను' అని ఆదుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి మంచి మనసుకు నిదర్శనమని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. మంత్రి ఫరూక్ క్యాంపు కార్యాలయంలో (రాజ్ టాకీస్) నందు 7 లక్షల 60 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ఎక్కువ ఆక్సిడెంట్స్ మరియు అనారోగ్య కారణాల వల్ల వచ్చే వారికి ఆరోగ్యం విషయంలో అజాగ్రత్త వహించకుండా జాగ్రత్తలు వహించాలని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పేద ప్రజలు ఏదైనా ప్రమాదంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నా, లేదా ఆరోగ్య పరంగా ప్రాణాల మీదకు వచ్చినప్పుడు అత్యవసరంగా ఆపరేషన్లకు కావల్సిన డబ్బులు లేకపోవడం, ,వారి స్థోమతకు మించి ఖర్చు చేయాల్సి వచ్చినప్పుడు మంత్రి ఫరూక్ కి విన్నవించుకున్న సందర్భంలో వారి ఆవేదన విని, అప్పటికప్పుడు దగ్గరుండి సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేయించారన్నారు. అలా పేదవారి ఆపరేషన్ల ఖర్చుకు సంబంధించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 11 మంది బాధిత కుటుంబ సభ్యులకు వచ్చిన 7 లక్షల 60 వేల రూపాయలను చెక్కుల రూపంలో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ గారు క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో 21 వ వార్డు కౌన్సిలర్ శ్రీదేవి , తిమ్మయ్య , పోలూరు జోజి రెడ్డి , జైచంద్ర రెడ్డి , మా భాష , అయ్యలూరు మాజీ సర్పంచ్ త్రిలింగేశ్వర్ రెడ్డి , రాయమాల్ పురం కాశన్న , అమర్నాథ్ రెడ్డి , 7 వార్డ్ ఇంచార్జ్ సైలాబ్ , గఫార్ , సద్దాం , 8 వార్డు ఇన్చార్జ్ ఉప్పరి సురేష్ కుమార్ , 29వ వార్డు ఇంచార్జ్ మంజుల సుబ్బరాయుడు , నాగరాజు , రామకృష్ణ , యాలూరు గంగుల వెంకటరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు

## ఘనంగా ప్రారంభమైన 68 వ రాష్ట స్థాయి యస్.జి.యఫ్ అండర్ -17 ఫెన్సింగ్ బాల బాలికల క్రీడలు

**తెలుగుదేశం ప్రభుత్వ హాయంలో క్రీడలకు పెద్ద పీట : నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్**

**నంద్యాల అక్టోబర్ 20 ( రిపబ్లిక్ న్యూస్):** విద్య శాఖ కమిషనర్ గారి ఉత్తర్వులు మేరకు 68 వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 బాల బాలికల ఫెన్సింగ్ క్రీడలు నంద్యాల పట్టణంలో ని స్థానిక పద్మావతి నగర్ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియం లో ఈ రోజు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ముఖ్య అతిథులుగా హాజరై లాంచనంగా ప్రారంభించారు. నంద్యాల జిల్లా విద్యా శాఖ అధికారి సుధాకర్ రెడ్డి సభాధ్యక్షత వహించిన ఈ కార్యక్రమము నంద్యాల జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య నిర్వాహక కార్యదర్శి శ్రీనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది.. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఉర్దూ డి.ఐ హాసముద్దీన్ నంద్యాల యం.ఈ.ఓ బ్రహ్మం నాయక్, మహానంది ఎంఈఓ రామసుబ్బయ్య ,సిరివెళ్ల ఎమ్ఈఓ శంకర్ ప్రసాద్, కోవెలకుంట్ల ఎంఈఓ వెంకట్రామిరెడ్డి, ఉయ్యాలవాడ ఎంఈఓ రఘురామిరెడ్డి, దొర్నిపాడు ఎంఈఓ మనోహర్ రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ అనుదీప్ ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నిమ్మకాయల సుధాకర్ హాజరయ్యారు. 13 జిల్లాల నుండి సుమారు 350 మంది క్రీడాకారులు 50 మంది క్రీడాధికారులు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.



ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హాయంలో క్రీడలను చాలా అభివృద్ధి చేశామని ప్రస్తుతం కూడా నంద్యాల పట్టణంలో కూడా క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని, క్రీడాకారులకు వసతులు సమకూరుస్తామని తెలియజేశారు. అలాగే తెలుగుదేశం పార్టీ హాయాంలో క్రీడాకారులకు మంచి గుర్తింపునిస్తామన్నారు . 13 జిల్లాల నుంచి క్రీడాకారులు నంద్యాలకు రావడం చాలా సంతోషంగా ఉందని ఈ రాష్ట్రస్థాయి పోటీలకు నంద్యాల ఆతిథ్యం వహించడం సంతోషం అన్నారు . క్రీడాకారులు అందరూ బాగా ఆడాలన్నారు ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు . జిల్లా విద్యా శాఖ అధికారి మాట్లాడుతూ క్రీడల విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం నంద్యాల జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఎన్ఎండి ఫిరోజ్ జిల్లా విద్యాశాఖ అధికారి , వ్యాయామ ఉపాధ్యాయులు డి.యస్.ఏ సిబ్బంది కలిసి ఘనంగా సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి గిడ్డయ్య, ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏపీ రెడ్డి ,నంద్యాల జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర, నాగరాజు పి.ఈ.టి మరియు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సంఘం కార్యదర్శి రవికుమార్, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఫెన్సింగ్ కోచ్ లు మహేష్,లక్ష్మణ్ వ్యాయామ ఉపాధ్యాయులు శివ కుమార్,విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## గడివేముల పోలీస్ స్టేషన్ ఫ్యాక్షన్ గ్రామం పెసరవాయిలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్

**శాంతి భద్రతల పరిరక్షణ నేర నివారణ లక్ష్యంగా కాటన్ సెర్చ్ ఆపరేషన్ ఆపరేషన్ నిర్వహణ**

**రౌడీషీటర్లు, అనుమానిత ప్రాంతాలు, అనుమానస్పద వ్యక్తుల ఇళ్ళల్లో విస్తృతంగా దాడులు.**

**గ్రామస్తులతో వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు**

**పాణ్యం ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి**

**నంద్యాల క్రైం, అక్టోబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో నేర నివారణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి ఉంచి కార్డెన్ సర్చ్ ఆపరేషన్ ఆదివారం నిర్వహించారు. ఈ సంధర్భంగా పాణ్యం ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి గడివేముల సబ్ ఇన్స్పెక్టర్ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో క్యూఆర్ టీం సిబ్బంది స్థానిక పోలీసులు బృందాలుగా ఏర్పడి నేడు తెల్లవారుజామున నంద్యాల సబ్ డివిజన్ పాణ్యం సర్కిల్ గడివేముల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామమైన పెసరవాయి నందు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితులు, రౌడీ షీటర్లు, నేర చరిత్ర గల వారి ఇళ్లలో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ ఏవరైనా చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, గ్రామాలలో ప్రశాంతత నెలకొల్పే విధంగా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని వాటికి గ్రామస్తులు సహకరించాలని, మీరు గొడవలకు,అల్లర్లకు పోకుండా శాంతియుతంగా జీవనం సాగించాలని, ఏదైనా అనుకోని సంఘటన జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలియజేశారు. అనంతరం ప్రస్తుతం సమాజంలో జరిగేటువంటి నేరాలు సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, మహిళలపై జరిగే నేరాలు మొదలగు పరిస్థితుల గురించి అవగాహన కల్పిస్తూ ఎవరైనా నేరాలకు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన



చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని పోలీసు అధికారులు హెచ్చరించారు. నిరంతరం కార్డెన్ సర్చ్ ఆపరేషన్ లు కొనసాగుతుంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాణ్యం ఇన్స్పెక్టర్ గడివేముల సబ్ ఇన్స్పెక్టర్ పాటు క్యూఆర్టీం సిబ్బంది స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



# నేడు పిజిఆర్ఎస్ ద్వారా ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ.

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఐ.ఎ.ఎస్



**నంద్యాల ప్రతినిధి, అక్టోబర్ 20, రిపబ్లిక్ న్యూస్ ::** నేడు నంద్యాల పట్టణం కలెక్టరేట్ లోని సెంటినరీ హాలులో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను "పబ్లిక్ గ్రివియన్స్ రెడ్రెస్సల్ సిస్టం (పి జి ఆర్ ఎస్)" ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే "పబ్లిక్ గ్రివియన్స్ రెడ్రెస్సల్ సిస్టం"

కార్యక్రమానికి నేడు ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన ఈవో.



**ఆత్మకూరు, అక్టోబర్ 20, రిపబ్లిక్ న్యూస్ ::** ఆత్మకూరు క్యాంపు కార్యాలయం లో శ్రీశైల ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీశైల దేవస్థానం నూతన ఇంచార్జ్ ఈవో చంద్రశేఖర్ రెడ్డి. ఈ సందర్భంగా స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు.

## పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి కి ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ అవార్డు ప్రధానం.



**నంద్యాల రూరల్, అక్టోబర్ 20, రిపబ్లిక్ న్యూస్ ::** నంద్యాల పట్టణం చెందిన శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి కి జాతీయ స్థాయిలో ప్రకటించే ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ అవార్డు ప్రధానం. సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్.పి.ఎల్.టి.ఓ) సంస్థ బెస్ట్ డైరెక్టర్ గా శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డిని ఎంపిక చేసింది. ఆదివారం సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వ్యవస్థాపకుడు డాక్టర్ పి. నాగయ్య ఆధ్వర్యంలో ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ అవార్డును పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డికి ప్రధానం చేశారు. విజయవాడలోని ఏసి కాలేజ్ అసెంబ్లీ హాల్ లో అవార్డును అందజేసారు. ఈ అవార్డు పంపిణీ కార్యక్రమంలో సభ అధ్యక్షులుగా గుంటూరు - కృష్ణా ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, ముఖ్య అతిథులుగా మలినేని గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ మలినేని పెరుమాళ్లు, గుంటూరు ఎమ్మెల్య నసీర్ అహ్మద్, పత్తిపాటి ఎమ్మెల్యే , గౌరవ అతిథులుగా ఏఎన్ యు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ వి. కన్న మాస్టార్, అప్పుస్మా రాష్ట్ర కోశాధికారి కాటూరి వెంకటేశ్వరరావు, ఏపీ ఎస్సీ ఎస్సీ రాష్ట్ర కౌన్సిల్ కో-చైర్మన్ మేకల రవీంద్రబాబు పాల్గొన్నారు. ప్రత్యేక అతిథులు గుంటూరు ఎ.సి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. మోజెస్, గుంటూరు ఎ.సి. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. రాణి, అమృత వర్షిణి పాల్గొన్నారు. సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాల రాష్ట్ర జాతీయస్థాయిలో గుర్తింపు పొందేలా పాఠశాల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి ఎంతో కృషి చేశారని కొనియాడారు. విద్యార్థుల విద్యాభివృద్ధి ప్రధాన లక్ష్యంగా పాఠశాలను ముందుకు నడుపుతున్న ఆయనకు ప్రత్యేక



అభినందనలు తెలియజేశారు. విద్యకే కాకుండా క్రీడలు సాంస్కృతిక రంగంలో, కలలను ప్రోత్సహిస్తూ విద్యార్థులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. విద్యార్థుల కోసం అనేక రకాల ప్రణాళికలు రూపొందిస్తూ వారిని ఉన్నత స్థాయిలో చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్న పెద్దిరెడ్డి షేక్షావల్లి రెడ్డిని బెస్ట్ డైరెక్టర్ గా గుర్తిస్తూ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా అవార్డును అతిథులు అందజేశారు. జాతీయ ప్రతిభ అందుకున్న పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డిని నంద్యాల పట్టణం చెందిన పలువురు గురు రాజా పాఠశాల ఉపాధ్యాయుల బృందం, తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

## భవన నిర్మాణ కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవాలి: సీ ఐ టీ యు డిమాండ్



**కర్నూలు అక్టోబర్ 20 (రిపబ్లిక్ న్యూస్):** భవన నిర్మాణ కార్మికుడు సీ మధు కరెంటు షాక్ తో చనిపోవడం జరిగింది. అతని ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి సానుభూతిని వ్యక్తం పరుస్తూ ఏపీ భవన మరియు ఇతర నిర్మాణాల కార్మిక సంఘం నగర కార్యదర్శి ( సిఐటియు) ఎస్ డి ఖాజా పాషా, సిఐటియు నాయకులు కే రామకృష్ణ,, నగర నాయకులు సాదిక్ ,హర్షద్ బాషా, ముసమి య్య తదితరులు కలిసి పరామర్శించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ పనిలో నిమగ్నమై ఉన్న ,సి మధు హఠాత్తుగాకరెంట్ షాక్ వల్ల చనిపోవడం జరిగిందని వారి కుటుంబానికి, ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ,ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు .రోజువారి పని చేసుకుని జీవించే ఈ కుటుంబం మధు పై ఆధారపడి ఉండేదని సంపాదించే వ్యక్తి కుటుంబంలో లేకపోవడంతో ఆ కుటుంబం రోడ్డు పాలు అయ్యే అవకాశం ఉందని కాబట్టి తక్షణమే ప్రభుత్వం 25 లక్షల రూపాయలు, ఎక్స్గ్రేషియా ,సీఎం సహాయ నిధి కింద ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు .ఆ రకంగా ఆర్థిక సహాయం చేసి ప్రభుత్వం వారి కుటుంబానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారుల స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకుని వచ్చి వారి కుటుంబానికి ఆర్థిక సాయం వచ్చేటట్టు చర్యలు తీసుకోవాలని ఏపీ భవన మరియు ఇతర నిర్మాణాల కార్మిక సంఘం డిమాండ్ చేశారు.

## నంద్యాల జిల్లాలో పలు ప్రాంతాలలో ఏకకాలంలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహణ

**అసాంఘిక,సంఘ విద్రోహశక్తుల ఆట కట్టించి నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**రౌడీషీటర్లు, అనుమానిత ప్రాంతాలు, అనుమానస్పద వ్యక్తుల ఇళ్లల్లో విస్తృతంగా దాడులు**

**సరైన ధృవపత్రాలు లేని సుమారు 52 వాహనాలు 20 లీటర్ల నాటు సారాయిని సీజ్**

**నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా %ఖూూ% గారి ఆదేశాలమేరకు**





**నంద్యాల క్రైం, అక్టోబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** నేర నివారణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి ఉంచి జిల్లాలోని డోన్ టౌన్ ,ఆళ్లగడ్డ రూరల్ సర్కిల్ చాగలమర్రి పోలీసు స్టేషన్ పరిధిలోని గొడిగనూరు, కొలిమిగుండ్ల పోలీసు స్టేషన్ పరిదిలోని అంకిరెడ్డి పల్లి, నందికొట్కూర్ రూరల్ సరికిల్ ముచ్చుమర్రి మొదలగు ప్రాంతాలలో ఆదివారం కార్డెన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లాను నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో జిల్లా పోలీసు అదికారులు ఆధ్వర్యంలో పైన తెల్పిన ప్రాంతాలలో జిల్లా ఎస్పీ ఆదేశాలతో వారివారి పోలీసు స్టేషన్ క్యూఆర్ టీం సిబ్బంది స్థానిక పోలీసులు బృందాలుగా ఏర్పడి తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితులు, రౌడీ షీటర్లు, నేర చరిత్ర గల వారి ఇళ్లలో సోదాలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో సరైన దృవపత్రాలు లేని సుమారు 52 వాహనాలు 20 లీటర్ల నాటు సారాయిని సీజ్ చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ ఏవరైనా చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, పోలీసు అధికారులు హెచ్చరించారు. కార్డన్ సెర్చ్ ఆపరేషన్ లు నిరంతరం కొనసాగుతుంటాయని పేర్కొన్నారు. ఈ విధంగా కార్డెన్ సర్చ్ ఆపరేషన్ చేయడం వలన పట్టణాలలో గ్రామాలలో ఎలాంటి నేరాలు జరగకుండా ఉంటాయని నేరాలు చేసిన వారిని పోలీసులు ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరని ప్రజలు తెలియజేస్తూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

## కలాపి రంగు సేవించి యువకుడు ఆత్మహత్య

**నంద్యాల క్రైం, అక్టోబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల పట్టణం విశ్వనగర్కు చెందిన ప్రవీణ్ కుమార్ (29) కలాపి రంగు సేవించి యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు రెండో పట్టణ సీఐ ఇస్మాయిల్ తెలిపారు. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక విశ్వనగర్కు చెందిన కృష్ణవేణి కుమారుడు ప్రవీణ్ కుమార్ బంగారు దుకాణం నడుపుతూ కుంటుంబాన్ని పోషించేవాడు. ఈ క్రమంలో గతేడాది కిందట తండ్రి మృతి చెందాడు. దీంతో కుటుంబానికి అండగా ఉంటూనే తండ్రి లేడని మనస్తాపనికి చెంది శనివారం రాత్రి ఇంట్లో కలాపిరంగు సౌభాగ్యం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక సర్వజన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగానే మృతి చెందారు. మృతుడి తమ్ముడు గణేశ్ కల్యాణ ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గ్రామాలలో సిసి రోడ్లకు భూమి పూజ చేసిన నందికొట్కూరు ఎమ్మెల్యే



**(పాములపాడు అక్టోబర్ 20 రిపబ్లిక్ న్యూస్ )**

పాములపాడు మండలం లోని కృష్ణారావుపేట ,తుమ్మలూరు గ్రామాలలో సిసి రోడ్లకు భూమి పూజ చేసిన నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య మరియు టిడిపి నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి గారు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో నందికొట్కూరు నియోజకవర్గం లోని పాములపాడు మండలంలోని కృష్ణారావుపేట మరియు తుమ్మలూరు గ్రామాలలో సిసి రోడ్ల భూమి పూజ కార్యక్రమంలో నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్త జయసూర్య ,మాండ్రసురేంద్రనాథ్ రెడ్డి , పాములపాడు. కన్వీనర్ రవీంద్రనాథ్ రెడ్డి, జడ్పిటిసి రామలింగేశ్వర రెడ్డి, సత్యనారాయణ రెడ్డి ,తిమ్మారెడ్డి, రామకృష్ణ ,వెంకటస్వామి, శేఖర్ ,ఇబ్రహీం , సీనియర్ జన సైనికుడు జనసేన రాము పూసల కృష్ణ, పూసల మధు ,తెలుగు యువత అధ్యక్షులు మధు





,గోవిందు , జనసేన సమన్వయ బాధ్యులు నల్లమల రవికుమార్ తదితరులు పాల్గొన్నారుపాములపాడు మండలంలోని 40 పనులకు గాను రెండు కోట్ల 60 లక్షలు రూపాయలు నిధులు కేటాయించారు

## ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుంది

**కాంగ్రెస్ నాయకులు ఎన్ సి బజారన్న**

**కర్నూల్ అక్టోబర్ 20 ( రిపబ్లిక్ న్యూస్):** ప్రజా పరిరక్షణ సమితి , నాలుగో తరగతి ఉద్యోగ ఇంటి స్థల బాధితులు సంయుక్తంగా ఆదివారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి దాదాపుగా అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు ఉపాధ్యాయ సంఘాలు హాజరు కావడం జరిగినది. ఈ కార్యక్రమం డేవిడ్ అధ్యక్షతన ప్రజా ప్రతిక్షణ సమితి నాయకులు నిర్వహించడం జరిగినది. కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులుగా రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు ఎన్సి బజారన్న, కర్నూల్ సిటీ ముస్లిం మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ అన్ని రాజకీయ పార్టీల నాయకులు ప్రజాసంఘాల నాయకులు అలాగే నాలుగో తరగతి ఇంటి స్థల బాధితులు కూడా పాల్గొనడం జరిగింది. బజారన్న మాట్లాడుతూ

నాలుగో తరగతి ఉద్యోగుల కోరికైన వారి ఇంటి స్థలాలను వారికి కేటాయించి అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దుపరిచి ఈ అక్రమాలకు పాల్పడిన వారిని పైన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కర్నూల్ టౌన్ ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా 1987 వ సంవత్సరంలో సొసైటీ ద్వారా ప్లాట్లను తీసుకున్నారని అందులో కొంతమంది సొసైటీ నాయకులుగా ఏర్పడి ఒరిజినల్ మెంబర్స్ కు అన్యాయం చేస్తూ అందులో ఉన్నటువంటి ప్లాట్లను వాళ్ల స్వప్రయోజనాల కోసం వాళ్ల లబ్ధి కోసం ఇతరులకు అమ్ముకొని తోటి ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్కు అన్యాయం చేయడం జరిగిందని అప్పటినుండి 40 సంవత్సరాలుగా మిగిలిన బాధితులు పోరాటాలు చూస్తూ చట్ట ప్రకారంగా కోర్టులను అధికారులను ఆశ్రయించి వారికి విన్నవించుకోవడం జరిగిందని, కోర్టు కూడా అన్యాయం జరిగిన వారికి న్యాయం జరపండి అని తీర్పు ఇచ్చిందని కానీ ఇక్కడ ఉన్న అధికారులు మాత్రం నిమ్మకు నీరెక్కినట్టుగా వ్యవహరిస్తున్నారని ఇప్పుడు ఈ అన్యాయానికి గురైన వారికి న్యాయం చేయుటకు ఈ ప్రజా పరిరక్షణ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘ నాయకులు కూడా పాల్గొనడం జరిగిందని ఈ కార్యక్రమంలో అన్యాయం జరిగిన వారికి పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి గఆదేశాల ప్రకారం కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పి మురళీకృష్ణ ఆధ్వర్యంలో



ఏ కార్యక్రమం జరిగిన కాంగ్రెస్ పార్టీ వెన్నంటి ఉంటూ వారికి న్యాయం జరిగేంత వరకు వారి పోరాటంలో పాలు పంచుకుంటామని బజారన్నగారు హామీ ఇచ్చారు. అనంతరం ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ

1980 ఆనాటి గవర్నమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇందిరా గాంధీ గారు ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కొరకు ఇచ్చిన స్థలాలు కబ్జాలకు గురి అయిన కారణంగా సమస్యలు పరిష్కరించడానికి ప్రజా సంరక్షణ సమితి ఏర్పడిందని ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ మన దేశానికి వెన్నెముక లాంటివారని కానీ వారికి ఎలాంటి అన్యాయం జరిగిన కాంగ్రెస్ పార్టీ ముందుండి పనిచేయుటకు మా జిల్లా అధ్యక్షులు పి మురళి కృష్ణ ఆదేశాల మేరకు ఎలాంటి కార్యక్రమాలు చేయడం కోసం సిద్ధంగా ఉన్నామని ఖాజా హుస్సేన్ తెలియజేశారు.

## ఏపీలో తెలంగాణ పోలీసుల కాల్పులు..



శ్రీ సత్యసాయి జిల్లా: బత్తలపల్లి మండలం రామాపురంలో ఒక్క సరిగా కాల్పుల కలకలం రేగింది. బీహార్కు చెందిన దొంగల ముఠాపై తెలంగాణ పోలీసులు కాల్పులు జరిపారు. దాదాపు మూడు రౌండ్లకు పైగా ఈ కాల్పులు జరిపారు. తెలంగాణలో దొంగతనాలకు పాల్పడిన బీహార్ దొంగల ముఠా ఏపీలోని బత్తలపల్లి మండలం రామపురంలో షెల్టర్ తీసుకున్నట్లు తెలంగాణ పోలీసులకు సమాచారం అందింది. దీంతో తెలంగాణ పోలీసులు శనివారం రాత్రి బత్తలపల్లికి చేరుకున్నారు. బత్తలపల్లి సమీపంలో ఉన్న రామాపురం బస్టాండ్ వద్ద మకాం వేశారు.

ఆదివారం కావడంతో సమీపంలో ఉన్న చికెన్ మటన్ షాపుల్లో ధరలు ఎలా ఉన్నాయంటూ షాపుల వాళ్లతో కూర్చుని మాట్లాడారు. ఇదే సందర్భంలో బీహార్ దొంగల ముఠా ద్విచక్ర వాహనాల్లో బయటికి రావడంతో అక్కడే కాపు కాచి ఉన్న తెలంగాణ పోలీసులు ఒక్క సారిగా బీహార్ దొంగలను పట్టుకునే ప్రయత్నం చేశారు. అయితే, ఈ దొంగల ముఠా పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసింది. దీంతో పోలీసులు ఆ దొంగలపై కాల్పులు చేశారు. దాదాపు మూడు రౌండ్లు కాల్పులు చేశారు.

అయినప్పటికీ బీహార్ దొంగల ముఠా తెలంగాణ పోలీసులకు చిక్కలేదు. వారిని తప్పించుకుని పరారయ్యారు. బీహార్ దొంగల ముఠాలో ఒకరు కదిరి వైపు వెళ్ళగా.. మరొకరు తాడిమర్ వైపు వెళ్లారు. దీంతో తెలంగాణ పోలీసులు టీమ్లుగా విడిపోయి వారిని ఛేజ్ చేశారు. ఈ షాకింగ్ ఘటనతో ఒక్కసారిగా రామాపురం సర్కిల్లో టెన్షన్ వాతావరణం ఏర్పడింది. బీహార్ దొంగల ముఠా రామాపురంలో ఉండడంతో వారికి ఎవరు ఆశ్రయం కల్పించారనే విషయంపై స్థానిక పోలీసులు ఆరా తీస్తున్నారు. రామాపురం చేరుకున్న ధర్మారం డిఎస్పీతో పాటు స్థానిక పోలీసులు.. స్థానికులను వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

## కేబినేట్ భేటీలో నిర్ణయం తీసుకోవాలి. జిల్లా ఉన్నతాభివృద్ధి కోసం జిల్లా ప్రజా ప్రతినిధులు స్పందించాలి.

## యూనివర్సిటీల అభివృద్ధి కోసం ప్రణాళిక సిద్ధం చేయాలి.

**కర్నూల్ అక్టోబర్ 20 ( రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో యూనివర్సిటీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రణాళిక సిద్ధం చేసి అభివృద్ధి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ... డిమాండ్ చేశారు. ఈసందర్భంగా రాయలసీమ యూనివర్సిటీ లో యూనివర్సిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఉన్నత విద్యా వ్యవస్థ కుంటుపడిందని దీనిపైన రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. జిల్లాలో ప్రధానంగా మూడు యూనివర్సిటీలు ఉన్నాయని వీటి అభివృద్ధిని గత ప్రభుత్వం మరిచిందని,ప్రస్తుత ప్రభుత్వం వెంటనే జిల్లాల్లో ఉండే యూనివర్సిటీలను అభివృద్ధి కొరకు ... ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో జిల్లాలో ఉన్న ప్రజాప్రతినిధులు ఎవరూ కూడా పట్టించుకోకుండా ఉన్నత విద్యా వ్యవస్థను నాశనం చేసారని ఎవ్వరూ కూడా యూనివర్సిటీల అభివృద్ధి కొరకు నోరుమెదపలేదని ఇది చాలా సిగ్గుమాలిన చర్యగా భావిస్తున్నామని తెలిపారు.

అదేవిధంగా ప్రస్తుత జిల్లా ప్రజా ప్రతినిధులు ... అభివృద్ధి చేయాలని,అందుకోసం వచ్చే రాష్ట్ర కేబినెట్ భేటీలో జిల్లా యూనివర్సిటీల అభివృద్ధి కోసం నోరుమెదపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే జిల్లా ఉద్యమ ప్రణాళిక రూపొందిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అమర్,రాజు,మౌలాలి,భరత్,జోష్,శివాజీ,సీను,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com